సాక్షి
ఏలూరు
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



ఆశాదీపం వైఎస్ జగన్

కొల్లేరు ప్రజల ఆశాదీపంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కనిపిస్తున్నారని ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ అన్నారు. 8లో



మద్యం మత్తులో..

మద్యం మత్తులో కాలుజారి చేపల చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన పిప్పరలో చోటుచేసుకుంది. 8లో

శ్రీవారికి కాసుల పంట



ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) దేవస్థానం వార్షిక ఆదాయం రూ.131 కోట్లకు చేరింది. 2022–23లో రూ.131,33,37,913 సమకూరింది. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సహరి (బుధవారం వేకువజాము)
ఏలూరు	6.28	4.28
జంగారెడ్డిగూడెం	6.23	4.29
కైకలూరు	6.26	4.38

న్యూస్‌రీల్

రక్తదానం మహోన్నతం



రక్తదాతలను అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యంబీఏ, టీమ్ దేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ తలసీమియా బాధితులు, గర్భిణులు, ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అసరమన్నారు. రక్తదానంపై అపోహలు వీడి అందరూ ముందుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ దూలం కిషోర్, డీఎంహెచ్ఓ డాక్టర్ డి.ఆశ, నూరుసార్లు రక్తదానం చేసిన బావిశెట్టి చిరంజీవి, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల యండి కే. సాయిరోహిత్, ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. శిబిరంలో దాదాపు 100 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఏలూరు జీజీహెచ్, వసుంధర బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు శిబిరంలో పాల్గొని రక్తాన్ని సేకరించారు.

11న అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు సంబంధించి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలను 15 ఏళ్ల కాలానికి లీజుకు ఇవ్వాలని నిర్ణయించామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఏలూరు, కలిదిండి, కైకలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట బస్టాండుల్లో వ్యాపారాభివృద్ధికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ స్థలాల లీజుకు సంబంధించిన వివరాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కలిగే సందేహాల నివృత్తి నిమిత్తం ఈనెల 11న ఏలూరులోని తమ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. సదస్సులో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొని సందేహాల నివృత్తి చేస్తారని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24,096 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లావ్యాప్తంగా 120 కేంద్రాల్లో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 24,556 మంది విద్యార్థులకు 24,096 మంది హాజరయ్యారు. విద్యార్థుల హాజరు 98.13 శాతంగా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 48 కేంద్రాల్లో, జిల్లా విద్యాశాఖాధికారి 5 కేంద్రాల్లో తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ తెలిపారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు 12న కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీ 1998కి సంబంధించిన అభ్యర్థుల్లో కనీసపు టైమ్ స్కేల్‌లో పనిచేయడానికి క్యారీ ఫార్వర్డ్ అయిన 274 పోస్టుల్లో నియామకం కోసం వెబ్‌సైట్‌లో మెరిట్ ప్రాతిపదికన 274 మంది అభ్యర్థుల వివరాలను డీఈఓ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో తెలియపరిచిన అభ్యర్థులు తప్పనిసరిగా ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, 1998 డీఎస్సీ హాల్‌టికెట్‌తో రావాలని కోరారు.

సహకారం.. స్వాహాపర్వం

ప్రభుత్వం కన్నెర్ర

- నకిలీ షూరిటీలతో భారీగా రుణాలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఉమ్మడి జిల్లాలోని ఆరు శాఖల్లో అక్రమాలు
- నాబార్డు వార్షిక తనిఖీలో వెలుగులోకి..
- ఉన్నత స్థాయి అధికారితో విచారణ
- 17 మంది అధికారులపై చర్యలకు సిఫార్సు



సాక్షి ప్రతినిధి,ఏలూరు: సహకార చట్టంలోని బ్యాంకుల నిబంధనలను పాటించలేదు.. రుణపరిమితిని అడ్డగోలుగా ఇష్టానుసారంగా పెంచేశారు.. సరైన షూరిటీలు లేకుండా కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేశారు. అర్హులైన రైతులకు ఇవ్వాల్సిన రుణాలను పక్కదారి పట్టించి మద్యం వ్యాపారులతో సహా పలువురికి కట్టబెట్టారు. ఇదంతా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని బ్రాంచీల్లో జరిగిన అవినీతి పర్వం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డీసీసీబీ పరిధిలోని ఆరు శాఖల్లో జరిగిన భారీ అవకతవకలపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. సమగ్ర విచారణ నివేదిక ఆధారంగా గతంలో పనిచేసిన ఉన్నతాధికారులందరిపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గతంలో పనిచేసిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు మేనేజర్ కేడర్‌లోని 17 మందిపై చర్యలు తీసుకోనున్నారు.

రుణాల మంజూరు విషయంలో..

జిల్లాలోని డీసీసీబీ పరిధిలోని పలు బ్రాంచీల్లో ఏళ్ల తరబడి రుణాల మంజూరు విషయంలో భారీగా అవకతవకలు జరిగాయి. వివాదాల్లో ఉన్న భూములను బ్యాంకుల్లో షూరిటీగా చూపించి కోట్ల రూపాయల రుణాలు పొంది తిరిగి రూపాయి కూడా చెల్లించని ఘటనలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని యలమంచిలి, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, ఏలూరుతో పాటు మరికొన్ని బ్రాంచీల్లో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం గుంటూరు కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిపై కో–ఆపరేటివ్ శాఖ కమిషనర్ ఎ.బాబు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

అక్రమాల్లో కొన్ని..

- యలమంచిలి బ్రాంచీలో వివాదాలతో ఉన్న ఆస్తులను షూరిటీలుగా చూపించి రూ.33.22 కోట్ల రుణం మంజూరు చేశారు. దీనిలో రూ.13.86 కోట్లు ఇప్పటికీ రికవరీ కాలేదు. అలాగే 2015–16, 2017–18 నాబార్డు వార్షిక తనిఖీల్లో నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించి రుణాలు మంజూరు చేసినట్లుగా నిర్ధారించారు. ఎలాంటి షూరిటీలు లేకుండా రుణాలు మంజూరు చేసి బ్యాంకుకు ఆర్థిక నష్టం చేకూర్చారు.
- **తాడేపల్లిగూడెం బ్రాంచీలో 104 మంది సభ్యుల పేరుతో రూ.2.80 కోట్లను ఓ రియల్టర్‌కు రుణంగా ఇచ్చారు. తాడేపల్లిగూడెంలోని డీసీసీబీ బ్రాంచీలో మొత్తం బకాయిల విలువ రూ.11.69 కోట్లు కాగా 559 రుణాలు విలువ రూ.4.30 కోట్లు. వీటి గడువు దాటినా కొన్నింటి వసూళ్లకు** ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- 2012–13 నుంచి 2018–19 వరకు డీసీసీబీ పలు శాఖల ద్వారా రూ.867.19 కోట్ల విలువైన 2,445 బ్యాంకు గ్యారంటీలు జారీ చేసింది. దీనిలో రూ.295.35 కోట్ల విలువైన 23 బ్యాంకు గ్యారంటీలను మద్యం వ్యాపారులు, రైస్‌మిల్లులు, ఇతరులకు ఇచ్చినట్టు గుర్తించారు.
- వ్యవసాయ భూమి విలువ భారీగా పెంచి షూరిటీగా చూపి రుణాలు కూడా మంజూరు చేశారు.

క్రిమినల్ కేసులు

అక్రమాలు జరిగిన క్రమంలో ఆయా కాలంలో పనిచేసిన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేశారు. మేనేజర్లు మన్నె మోహనరావు, ఐవీ నాగేశ్వరరావు, డి.ఆంజనేయులు, టీవీ సుబ్బారావు, కేవీ అజయ్‌కుమార్, జి.పిచ్చయ్యచౌదరి, కె.సురేంద్రప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణ, జేఎస్‌వీ సత్యనారాయణరావు, సీహెచ్ రత్నకుమారి, కె.కిరణ్మయి, వి.శ్రీదేవి, డి.రమణ, జనరల్ మేనేజర్లు ఎ.మాధవీమూర్తి, వైవీ రాఘవేంద్రరెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీఎం ఫణి తదితరులపై క్రిమినల్ చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిఫార్సు చేశారు.

జేసీ లావణ్యవేణి బాధ్యతల స్వీకరణ



ఏలూరు(మెట్రో): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి.లావణ్య వేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేను వేగవంతం చేయడం, పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారం, ముంపు బాధితులను పునరావాస కాలనీలకు తరలింపు, పేదలకు ఇళ్ల స్థలాల అందజేత, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో భాగంగా ఫ్యామిలీ డాక్టర్, నాడు–నేడు తదితర అంశాలతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అన్నిరంగాల్లో జిల్లాను ముందంజలో ఉంచడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని చెప్పారు. ఆమెను జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్‌మూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజూభార్గవి, డీఎస్ఓ ఆర్ఎస్ఎస్ రాజు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజల ఆశీర్వాదాలే మా బలం



ఏలూరు 50వ డివిజన్‌లో ఓ ఇంటి వద్ద జగన్ స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రజలంతా జగనన్నే మా భవిష్యత్తు అంటూ ఆయన పాలనకు మద్దతునిస్తున్నారని, ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ మేలు జరిగిందని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 50వ డివిజన్ వీవీ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఇంటింటా పీపుల్స్ సర్వే నిర్వహించారు. తొలుత బెయిలీ బ్రిడ్జి సమీపంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల అనుమతితో వారి ఇంటి గోడలపై జగన్ స్టిక్కర్ అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ట రాజకీయాలకు ప్రజలే సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగలా సాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని చూసి చంద్రబాబు తట్టుకోలేక నీచ రాజకీయాలు చేస్తున్నాడని, ఆయన ఎన్ని కుట్రలు చేసినా ఫలించవన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రజల మద్దతును తెలుసుకునేందుకు చేస్తున్న గొప్ప కార్యక్రమం అని అన్నారు. చంద్రబాబు గతంలో చేసిన ఏ పని గురించి అయినా ఇప్పుడు చెప్పుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో చేసిన మంచిని చూసి ఓటు వేయాలని ప్రజలను ధైర్యంగా తాము కోరుతున్నామన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచెన రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్‌కుమార్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, సీతా జైన్, కార్పొరేటర్లు నున్నా స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, చిలకపాటి డింపుల్, ఇనపనూరి కేదారేశ్వరి, పొలిమేర దాసు, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, సుంకర చంద్రశేఖర్, తంగెళ్ల రాము, బత్తిన విజయకుమార్, దేవరకొండ శ్రీనివాస్, గరికిముక్కు జయకర్, పోతర్లంక లక్ష్మణ్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ ఖైసర్, జోన్–1 సచివాలయ ఇన్‌చార్జి మోటమర్రి సదానందం, కిలాడి దుర్గారావు, అర్జి నాగేశ్వరరావు, నున్నా కిషోర్, జనపరెడ్డి కృష్ణ, అమీనా అన్సారి, భోగిశెట్టి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కార తీరుపై సమీక్షిస్తాం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

ఏలూరు(మెట్రో): స్పందనలో అందిన దరఖాస్తుల పరిష్కార తీరుపై ఆయా శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గత మూడు నెలల్లో స్పందనలో అందిన ఫిర్యాదుల పరిష్కార తీరుపై సమీక్షించి, అర్జీదారులు ఏమేరకు సంతృప్తి చెందారన్నది తెలుసుకుంటామన్నారు.

అర్జీల్లో కొన్ని..

- నూజివీడు మండలం మిట్టగూడెంకు చెందిన కొమ్మిని రూత్ విలసిత మంజరి తన ఆస్తిని సోదరులు కాజేశారని, న్యాయం చేయాలని కోరారు.
- కుమారుడు, కోడలు తనను, తన భర్తను హింసిస్తున్నారని, రక్షణ కల్పించాలని ఏలూరు 18వ డివిజన్‌కు చెందిన దుగ్గినపల్లి కుమారి అర్జీ అందజేశారు.
- ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో బోదెను కొందరు ఆక్రమించారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.
- భీమడోలు మండలం సూరప్పగూడెంలోని హారిక సీడ్స్ కంపెనీకి చెందిన 11 కార్మికులు తమకు ఏడాదిగా సంస్థ జీతాలు చెల్లించడం లేదని, చర్యలు తీసుకోవాలని కోరారు.
- దెందులూరు మండలం దోసపాడుకు చెందిన నేతల యేసేబు తమ భూమి అన్యాక్రాంతమైందని, చర్యలు తీసుకోవాలని కోరారు.
- దెందులూరు మండలం కొమిరెపల్లిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సమస్య పరిష్కరించాలని సబ్బవరపు శ్రీలేఖ అర్జీ అందజేశారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, జిల్లాపరిషత్ సీఈఓ కె.రవికుమార్, ఆర్డీఓ కె.పెంచెల్‌కిశోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, ఎస్.సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ, డీపీఓ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గొల్లభామ



ఆకులో ఆకునై అన్నట్టు.. ఎండిన ఆకులు, సన్నని తీగ మాదిరి శరీరాకృతితో గొల్లభామ ఆకట్టుకుంది. సోమవారం కొయ్యలగూడెంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్ గార్డెన్‌లో ఇలా కనిపించింది.

– కొయ్యలగూడెం

టీడీపీ ఎమ్మెల్యే తీరుపై మండిపాటు

రోడ్డుపై బైఠాయించిన అదే పార్టీ మాజీ సర్పంచ్



రోడ్డుపై బైఠాయించిన బచ్చు కృష్ణ

ఆకివీడు : సమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే ఎందుకు.. ధర్నాలు చేయడానికేనా అంటూ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బచ్చు కృష్ణ సొంత పార్టీ ఎమ్మెల్యే తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన ఘటన సోమవారం జరిగింది. ఆకివీడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈ ఉదంతం చోటుచేసుకుంది. విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా చేసేందుకు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి కొద్దిసేపు నినాదాలు, ప్రసంగాలు ఇచ్చి వెళ్లిపోయిన ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రవర్తనపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, అజ్జమూరు మాజీ సర్పంచ్ బచ్చు కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన టీడీపీ మండల అధ్యక్షుడు మోటుపల్లి ప్రసాద్, నేతలు పిన్నమరాజు శ్రీనివాసరాజు, గంధం ఉమ, అజ్మల్ తదితరులు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి కృష్ణను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బచ్చు కృష్ణ మాట్లాడుతూ అజ్జమూరులో విద్యుత్ షాక్‌కు గురై గతంలో ఓ బాలుడు మృతిచెందాడని, ఇటీవల ఓ మహిళ తీవ్రంగా గాయపడిందని, బాధితులను పరామర్శించడంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే రామరాజు సోమవారం సాయంత్రం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

హైవేపై ట్రామాకేర్ సెంటర్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, ఏలూరు : జిల్లాలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రధానంగా భీమడోలు జంక్షన్ యాక్సిడెంట్ జోన్‌గా ఉందని గుర్తించామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. భీమడోలులో జాతీయ రహదారిపై రూ.90 లక్షల నిధులు, దాతల సహకారంతో ట్రామాకేర్ సెంటర్ నిర్మించి అత్యవసర చికిత్స అందిస్తామని చెప్పారు. రామసింగవరంలో ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ, తంగెళ్లమూడిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతిపాదన, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన ఇలా పలు అంశాలపై 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

రామసింగవరంలో ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ

దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలోని రామసింగవరంలో ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ ఏర్పాటుకు వీలుగా 50 ఎకరాల భూమిని గుర్తించాం. ఏపీఐఐసీకి చెందిన భూమి అందుబాటులో ఉండగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. దీనిలో కొంత మేర అటవీ భూమి ఉంది. దానికి అటవీశాఖ అనుమతులు రావాలి. 25 ఎకరాల్లో ఆయిల్‌ఫెడ్ నేతృత్వంలో ఫ్యాక్టరీ, మరో 25 ఎకరాల్లో నర్సరీని ఏర్పాటుచేసి స్థానికంగా ఆయిల్‌పామ్ మొక్కలను అభివృద్ధి చేసి రైతులకు అందించాలన్నదే లక్ష్యం. ఇప్పటికే దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యమంత్రితో మాట్లాడి పరిశ్రమ ఏర్పాటు దిశగా కృషి చేస్తున్నారు.

సీఎస్ఆర్‌తో అభివృద్ధి పనులు

సీఎస్ఆర్ నిధులతో జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. భీమడోలులో ట్రామాకేర్ సెంటర్ నిర్మాణం, జాతీయరహదారి నుంచి ద్వారకాతిరుమల వరకు 12 కిలోమీటర్ల మేర సెంట్రల్ డివైడర్ మధ్య నర్సరీ, పాదచారులకు ప్రత్యేక ఏర్పాట్లు, డివైడర్‌లో మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.



జిల్లాలో సుమారు 400 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.10 లక్షల వ్యయంతో వెయింగ్ స్కేల్స్‌ను, సైజ్ చార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అలాగే రూ. 40 లక్షల సీఎస్ఆర్ నిధులతో అసంపూర్తిగా ఉన్న కైకలూరు తహసీల్దార్ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేయనున్నాం.

'స్పందన' అర్జీలపై..

జిల్లావ్యాప్తంగా ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు లోబడి పరిష్కరిస్తున్నాం. అర్జీల పరిష్కారంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది. ఫిర్యాదుల పరిష్కారంతో పాటు వ్యక్తిగత సాయాలు, ఇతర అంశాలపై అర్జీదారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత విభాగాలకు పంపి పరిష్కారమయ్యే వరకూ పర్యవేక్షిస్తున్నాం.

ఇళ్ల నిర్మాణంలో..

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఉగాది నాటికి 25 వేల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా ఆ మేరకు పనులు పూర్తయ్యాయి. ఏలూరు నియోజకవర్గంలోని లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నాం. పోణంగిలోని జగనన్న లేవుట్లల్లో 5,688 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశాం. ప్రతి వారం హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించి పనులు వేగంగా జరిగేలా ప్రత్యేక దృష్టి నిలిపాం. వట్లూరు, భోగాపురం గ్రామాల్లో 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు, ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో ఎంఎస్ఎంఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నాం. ఏలూరులోని తంగెళ్లమూడిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

క్లుప్తంగా

మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి


బస్సాన్‌దాస్ మృతదేహం

గణపవరం: మద్యం మత్తులో కాలుజారి చేపల చెరువులో పడి ఒక యువకుడు మరణించిన సంఘటన పిప్పరలో జరిగింది. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం చిలకంపాడు గ్రామానికి చెందిన పాండ్రంకి వెంకన్నకు పిప్పర గ్రామంలో చేపల చెరువు ఉంది. చెరువు వద్ద ఆరునెలలుగా అస్సాం రాష్ట్రానికి చెందిన బస్సాన్‌దాస్(45) పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. ఉదయం దాస్ మృతదేహాన్ని చూసి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటేశ్వరరావు మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినవెంకన్న వార్షిక ఆదాయం రూ.131 కోట్లు

- 2021-2022 కంటే రూ.2.55 కోట్లు పెరిగిన ఆదాయం
- రూ.11.92 కోట్లు పెరిగిన నికర వార్షిక ఆదాయం





ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి (చినవెంకన్న) వార్షిక ఆదాయం రూ.131 కోట్లకు చేరింది. 2019 తర్వాత రెండేళ్ల పాటు కోవిడ్ కారణంగా శ్రీవారి ఆదాయం గణనీయంగా తగ్గింది. ఆ తరువాత 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ముందెన్నడూ లేనివిధంగా స్వామివారికి రూ.128,77,75,411 ఆదాయం లభించగా, 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 131,33,37,913 ఆదాయం సమకూరింది. 2021-2022తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో రూ. 2,55,62,502 ఆదాయం పెరిగింది. ఇదిలా ఉంటే దేవస్థానం ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులు పోగా 2021-2022 నికర ఆదాయం రూ. 57,16,25,467 కాగా, 2022-2023 నికర ఆదాయం రూ.69,08,86,656గా ఉంది. దీని ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో స్వామివారి నికర ఆదాయం రూ. 11,92,61,189 పెరిగింది.

అభివృద్ధితో పాటు పెరుగుతున్న ఆదాయం

శ్రీవారి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్న విధంగానే స్వామివారి ఆదాయం కూడా అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో స్వామివారిని దాదాపు 25 నుంచి 40 వేల మందికి పైగా, అలాగే సాధారణ రోజుల్లో 5 నుంచి 12 వేల మందికి పైగా భక్తులు దర్శిస్తున్నారు. పెద్ద తిరుపతి వెంకన్న మొక్కులను ఇక్కడ తీర్చుకోవచ్చనే సంప్రదాయం ఉండటంతో తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన యాత్రికులు సైతం ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. వీఐపీల తాకిడి కూడా పెరిగింది. క్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. అభివృద్ధి పనులు సైతం శరవేగంగా జరుగుతున్నాయి. దాతలు కాటేజీల నిర్మాణం, డోనార్‌స్కీం, శాశ్వత నిత్యాన్నదానం, గోసంరక్షణ, విమాన గోపుర స్వర్ణమయ పథకాలకు, ప్రాణదాన ట్రస్ట్‌కు విరివిగా విరాళాలను అందజేస్తున్నారు.

శ్రీవారి వార్షిక నికర ఆదాయ వివరాలు

విభాగం	2021-2022 (రూ.కోట్లలో)	2022-2023 (రూ.కోట్లలో)	పెరిగిన ఆదాయం (రూ.కోట్లలో)
హుండీల నుంచి	31,93,95,423	35,08,11,040	3,14,15,617
గదులు, సత్రాలు, కాటేజీలు	3,11,93,926	3,54,96,387	41,52,357
ఇతర అద్దెలు			
ప్రసాదాల విక్రయాలు	16,59,06,713	17,73,55,982	1,23,13,629
దర్శనం, ఆర్జిత సేవలు	12,55,19,222	16,28,99,627	3,73,80,405
కానుకలు, వివాహ శుభకార్యాలు	84,30,129	1,40,74,667	56,44,538

ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు సౌర వెలుగులు

పూర్వ విద్యార్థుల సాయంతో ప్లాంట్ ఏర్పాటు


హైస్కూల్ పై భాగాన ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్

నూజివీడు: 130 ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు సోలార్ విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. 1973-74 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే లక్ష్యంతో సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. దీని ఏర్పాటుకు మొత్తం రూ.4 లక్షలు వ్యయం కాగా హైస్కూల్ పైభాగంలో సోలార్ పలకలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాఠశాలకు విద్యుత్ అంతరాయం ఇక నుంచి ఉండదు. రెండు నెలల క్రితం సోలార్ విద్యుత్ ప్లాంట్ పాఠశాలకు అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి పాఠశాలకు కరెంటు కష్టాలు తొలగిపోయాయి. అంతేగాకుండా ప్రతినెలా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పని లేదు. హైస్కూల్‌లో మొత్తం 30 గదులున్నాయి. ఈ గదుల్లో లైట్లు వెలగాలన్నా, ఫ్యాన్లు వెలగాలన్నా కరెంటు వాడకం ద్వారా నెలకు విద్యుత్ బిల్లు రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు వస్తోంది. ఇక నుంచి ఈ మొత్తం ఆదా కానుంది. ఈ పాఠశాలలో నాడు-నేడు పథకం మొదటి విడతలో రూ.కోటితో మౌలిక సదుపాయాలను కల్పించారు. తాజాగా నాడు-నేడు రెండో విడతలో భాగంగా రూ.1.50 కోట్లతో అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. 1973-74 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి 5 కేవీ సామర్థ్యం కల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఏపీసీపీడీసీఎల్‌కు చెందిన విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేశారు. దీని వల్ల ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్‌ను ఏపీసీపీడీసీఎల్ తీసుకోవడంతో పాటు వాళ్ల విద్యుత్‌ను హైస్కూల్‌కు ఇస్తారు. సెలవు రోజుల్లో ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను విద్యుత్ శాఖ తీసుకుంటుంది. విద్యుత్ శాఖ తాను తీసుకునే సోలార్ విద్యుత్‌కు ఒక యూనిట్‌కు రూ.4.65 పైసలు చెల్లిస్తుంది.

కొల్లేరు ప్రజల ఆశాదీపం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ


కొల్లేరు భూములపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: కొల్లేరు ప్రజల ఆశాదీపంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కనిపిస్తున్నారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. ఏలూరు కలెక్టరు కార్యాలయంలో మంగళవారం కలెక్టరు అధ్యక్షతన అటవీ, రెవెన్యూ ఉన్నతాధికారులతో కొల్లేరు భూములపై కీలక సమావేశం నేపథ్యంలో ఆటపాక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో గెజిట్‌లో నిర్ణయించిన సర్వే నెంబర్లు కాకుండా అదనంగా 7,500 ఎకరాల అదనపు భూమిని ధ్వంసం చేశారన్నారు. పొరపాటున జరిగిన విషయాన్ని అప్పటి కలెక్టరు నవీన్‌మిట్టల్ ఒప్పుకున్నారన్నారు. అదనపు భూముల ధ్వంసం వివరాలు రికార్డులతో సహా తన దగ్గర ఉన్నాయన్నారు. కొల్లేరు అదనపు ధ్వంసం భూముల విషయంలో సీఎం జగన్ ఉన్నతాధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. కొల్లేరు ప్రజలకు కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. కీలక సమావేశంలో సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేంద్రం నియమించిన ఎంపవర్ కమిటీ ముందు గోచికట్టుకుని తమ కొల్లేరు బతుకులు ఇవని చూపించానని ఎమ్మెల్సీ చెప్పారు. టీడీపీలో 22 సంవత్సరాలు పాలేరుతనం చేశానన్నారు. అణగదొక్కుతున్న తనకు సీఎం జగన్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. తనకు టీడీపీలో అన్యాయం జరిగినప్పుడు లేవని నోర్లు ఇప్పుడు లేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో తన ఫొటోలకు కొందరు నలుపురంగు పూస్తున్నారని, అలాగయితే ఎంతో మంది వివిధ పార్టీలు మారుతున్నారని వారి ఫొటోలపైన నలుపురంగు పూయాలన్నారు. తాను ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయకముందే విమర్శలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కొల్లేరు ప్రాంత నియోజకవర్గాలైన కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఉండి నియోజకవర్గాల్లో విజయానికి కృషి చేస్తానని తెలిపారు.


లింగపాలెం: మండలంలోని అన్నపనేనివారిగూడెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

గడపగడపకు సంక్షేమం


పెదపాడు: మండలంలోని కొక్కిరపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

రోల్‌మోడల్‌గా నిలిచేందుకు కృషి చేయాలి

ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి


పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న ఆర్జీయూకేటీ చాన్సలర్, డైరెక్టర్‌లు

నూజివీడు: శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అవగతం చేసుకుంటూ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిచేందుకు కృషి చేయాలని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో గత మూడు రోజులుగా నిర్వహిస్తోన్న సాంకేతిక సంబరం టెక్‌జైట్-23 సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చాన్సలర్ కేసీ రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీల లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. సాంకేతిక విద్యను ఇన్ని వేల మందికి దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనల వైపు దృష్టి సారించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి సాంకేతిక సంబరాలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందింప చేసుకోవడానికి, సృజనాత్మకతను ప్రదర్శించడానికి దోహదపడతాయన్నారు. డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక రంగం రోజురోజుకు వేగంగా ముందుకు సాగుతోందని, ఆ వేగాన్ని ఇంజినీరింగ్ విద్యార్థులు అందుకోగలగాలని అన్నారు. ఈ రోజుల్లో ఎన్నో సదుపాయాలు, సౌకర్యాలను అందుబాటులో ఉంచి ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో దేశ గరివ్వంచదగిన స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు చాన్సలర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ప్రదీప్, డీన్ అకడమిక్ లక్ష్మణరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్స్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఐసీఎం చర్చి కన్వెన్షన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పెద్ద రైల్వేస్టేషన్ రోడ్డులోని ఇండియా క్రిస్టియన్ మిషన్ (ఐసీఎం) చర్చ్ 122వ జనరల్ కన్వెన్షన్, ఉజ్జీవ మహా సభలు ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐసీఎం సంఘాల అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో ఏబీసీ జాతీయ అధ్యక్షుడు గెరా హనోక్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్రైస్తవ వేదాంతి మృత్యుంజ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభల్లో కృష్ణ, గోదావరి జిల్లాల నుంచి ఐసీఎం సంఘాల సభ్యులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు.

12న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 12న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్ మహిళ, పురుషుల షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడులో డాక్టర్ ఏఎస్ఎన్ రాజు స్పోర్ట్స్ అకాడమీలో సాయంత్రం 3.30 గంటలకు పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొని జిల్లా జట్లకు ఎంపికైన వారు ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

దర్శనం టికెట్ల 'రీ ప్రింట్' స్కాం

ఒక ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో దర్శనం టికెట్ల రీ ప్రింట్ స్కామ్ సోమవారం బట్టబయలైంది. ఈ వ్యవహారంలో ఒక ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యాడు. వివరాల ప్రకారం.. చినవెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులు ఉత్తర రాజగోపుర ప్రాంతంలో ఉన్న కౌంటర్‌లో రూ. 200 టికెట్లు కొనుగోలు చేశారు. ఆలయంలోకి వెళుతున్న సమయంలో ఆ భక్తుల వద్ద ఉన్న టికెట్లను దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు పరిశీలించారు. ఆ సమయంలో రెండు టికెట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండడాన్ని ఆయన గుర్తించారు. అనుమానం కలిగి మిగిలిన భక్తుల వద్ద టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించగా, అదే తరహాలో మరో రెండు టికెట్లు దర్శనమిచ్చాయి. దాంతో రెండు టికెట్లు ఒరిజినల్, రెండు టికెట్లు డూప్లికేట్ అని తెలుసుకుని, విషయాన్ని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే కౌంటర్‌లో విధులు నిర్వర్తించే రికార్డ్ అసిస్టెంట్ చిలుకూరి పవన్ కుమార్ ఈ టికెట్ల రీ ప్రింట్‌కు పాల్పడుతున్నట్టు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని, అతడిని సస్పెండ్ చేసినట్టు ఈఓ తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇస్తానని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణకు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పట్నాల గణపతి కృతజ్ఞతలు తెలిపారు.కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద సోమవారం ఉపముఖ్యమంత్రిని కలిసి హర్షం ప్రకటించారు. కొట్టు సత్యనారాయణకు దన్యవాదాలు తెలిపిన వారిలో ఉపాధ్యక్షుడు గుమ్ములూరి శ్రీహరి, గౌరవ సలహాదారుడు బండారు పెద్దిరాజు, సెక్రటరి టి.నరసింహమూర్తి, కోశాధికారి పసుమర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష తులసి పత్రి పూజ

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల గ్రామంలో ఉమా సమేత రామలింగేశ్వరస్వామి, రాధాకృష్ణ స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాధాకృష్ణ స్వామివారికి లక్ష తులసి పత్రి పూజ చేశారు. బోడపాటి విజయ్‌కుమార్ - లక్ష్మీ నాగమణి దంపతులచే అర్చకులు పుల్లేటికుర్తి సత్య వెంకట నాగభూషణం బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. రాధాకృష్ణ స్వామివార్లకు అభిషేకాలు, లక్ష్మీ గణపతి ఆరాధన, అష్ట లక్ష్మీ గణపతి ఆరాధన, గణపతి హోమం, అనంతరం లక్ష తులసి పత్రి పూజ చేశారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. గ్రామ పెద్దలు బోడపాటి వెంకటనారాయణ, బుజ్జి, మహిళలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి హుండీ చోరీ

చాట్రాయి: మండలంలోని చాట్రాయి ఆంజనేయ స్వామి విగ్రహం కానుకల హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. ఈ విగ్రహం చాట్రాయి-పోలవరం గ్రామాల మధ్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఏసీల చోరీపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక పేపర్ యూనిట్‌లో ఏసీలు చోరీకి గురైన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీనగర్‌లోని సింధూర పేపర్ యూనిట్‌లో ఈనెల 9న రెండు ఏసీలు చోరీకి గురయ్యాయి. అందులో మెయింటెనెన్స్ వర్కర్‌గా పనిచేస్తున్న రెడ్డి కొండలరావుపై అనుమానం ఉన్నట్టు యూనిట్ సీనియర్ మేనేజర్ టి.ప్రేమసుందర్ ఆనంద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

18 నుంచి దూరవిద్య ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి ఈ నెల 18 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ ప్రతీ రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టిక్కెట్లు ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్ కోర్సులకు పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం 10వ తరగతి గణితం పరీక్షకు 1017 గాను 924 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ గణితం పరీక్షకు 597 మందికి గాను 534 మంది చరిత్ర పరీక్షకు 384 మందికి 341 మంది హాజరయ్యారు.